క్లుప్తంగా

బకాయిలు చెల్లించకపోవడం దారుణం

అనపర్తి : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రభుత్వానికి విక్రయించి నెలన్నర కావస్తున్నా.. రైతులకు డబ్బులు చెల్లించకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల సమస్యపై మంగళవారం పెదపూడి మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

త్రిముఖ లింగేశ్వరుని అభిషేకాలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం వద్ద కొమరిపాలెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చింతా పాండురంగ జ్ఞాపకార్థం వారి కుమారుడు వీర్రాఘవరెడ్డి ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలోని ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

టీబీ ముక్త భారత్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి: దేశంలో గణనీయంగా తగ్గిన టీబీని పూర్తిగా అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో టీబీ ముక్త భారత్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం రూరల్ హెల్త్ సెంటర్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్లు, నర్సులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

122 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకట రమణ అన్నారు. ఆ గ్రామంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ ప్రారంభించారు. రామచంద్రపురానికి చెందిన నేత్ర ప్రాథమిక కంటి ఆస్పత్రి వైద్యులు సీహెచ్ కుమార్, పి.సాయిలక్ష్మి.. శిబిరంలో 122 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వారిలో 24 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిరియాల శ్రీనుపాల్గొన్నారు.

కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు

సీతానగరం: కౌలుకార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, మండలంలోని కౌలుదారులు తమరి పరిధిలోని వీఆర్వోలకు కౌలుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూయజమాని నుంచి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్, కౌలుదారుడి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్‌లను అందించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.భారతి సోమవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

28న కోరుకొండలో..

కోరుకొండ: ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు.



రాజమహేంద్రవరంలో జక్కంపూడి గణేష్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు



యువత పోరుకు బయలుదేరుతున్న పార్టీ శ్రేణులు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

కూటమి తీరుపై యువత పోరు

- కలెక్టరేట్‌కు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- అన్ని మండలాల నుంచి భారీగా తరలి వచ్చిన యువత
- ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



యువతపోరులో పాల్గొన్న బిక్కవోలు మండల నాయకులు

అనపర్తి: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించడంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన యువత పోరు విజయవంతమైంది. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాకు రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయారెడ్డి, అనపర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి ఆధ్వర్యంలో అనపర్తి పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున మోటారు సైకిళ్లు, కార్లు, జీపులలో తరలివెళ్లారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

హామీలను విస్మరించారు

డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో ఇవ్వకపోవడంతో విద్యార్థులను కళాశాలలు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు భారీగా పాల్గొన్నారు.

బిక్కవోలు మండలం నుంచి..

బిక్కవోలు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం.. నిరుద్యోగులను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బిక్కవోలు మండల నుంచి భారీ ఎత్తున నాయకులు రాజమహేంద్రవరంలో జరిగిన యువత పోరుకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని చంద్రబాబు, కూటమి నాయకులు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బొడ్డు ముత్యాలరావు, గువ్వల సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

రాజానగరం: నేలలు, వాటిని సారవంతం చేసే పద్ధతులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, తదనుగుణంగా యాజమాన్య పద్ధతులను ఆచరిస్తే పంటలలో మంచి దిగుబడులు పొందవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. దివాన్ చెరువు జిల్లా ఏరువాక కేంద్రంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన 30 సహకార సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 'సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై 15 రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పొందిన శిక్షణను కార్యాచరణలో చూపుతూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భూసార పరిరక్షణలో విస్తరణ విద్య పాత్రపై డాక్టర్ నాగేంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం శిక్షణకు సంబంధించిన పాఠ్య ప్రణాళికను విడుదల చేశారు. కార్యక్రమంలో మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రతినిధి డాక్టర్ టి.శ్రీనివాస్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సీతాపతిరావుకు సన్మానం



తహసీల్దార్ సీతాపతిరావును సన్మానిస్తున్న వీఆర్వోలు

పెదపూడి: కాకినాడ జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా పెదపూడి మండల రెవెన్యూ అధికారి పీవీ సీతాపతి రావు అవార్డు పొందడం అభినందనీయమని మండల వీఆర్వోల అసోసియేషన్ ప్రతినిధులు గొల్లపల్లి అంజిబాబు, పంపన శ్రీను అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సీతాపతిరావును వీఆర్వో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజిబాబు, పంపన శ్రీను మాట్లాడుతూ విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించే వారు ఉత్తమ అవార్డులు పొందుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవిందు, వీఆర్వోలు నాగేంద్ర, కొరెడ్ల రమేష్‌బాబు, లంక కుమార్, ఏడుకొండలు, భాగయ్య, సునీత, కరీమ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే.. ఇంతవరకూ ఇక్కడ సీ గుమస్తాగా పనిచేసి కాజులూరు మండలానికి బదిలీ అయిన శంకర్‌కు, నూతనంగా సీ గుమస్తాగా బాధ్యతలు స్వీకరించిన ముంతాజ్ బేగానికి అసోసియేషన్ తరఫున అభినందనలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

కోరుకొండ: మండలంలోని పశ్చిమగానుగూడెంలో సోమవారం ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నూతన కమిటీల ద్వారా నాయకత్వాన్ని విస్తృతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఉండడం ద్వారా మనకు రావాల్సిన రిజర్వేషన్ పొందుతామన్నారు. సమావేశంలో కత్తి సోమరాజు, ఖండవల్లి సత్తిబాబు, వేమగిరి నాగరాజు, ఖండవల్లి వీరబాబు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధనాలపై జీజీయూలో సదస్సు



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ

రాజానగరం: ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిపేందుకు వీలుగా అంతర్గత దహన యంత్రాలను మార్పు చేయవచ్చని జేఎన్‌టీయూకే మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.బాలకృష్ణ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రత్యామ్నాయ ఇంధనాలు, సీఎఫ్‌డీ విశ్లేషణ' అనే అంశం పై ఏఐసీటీఈ శిక్షణ, అభ్యాసం, అటల్ ఆఫ్‌లైన్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ తరగతులకు జీజీయూ అధ్యాపకులతో పాటు రాష్ట్రంలోని ఇతర కళాశాలల నుంచి 50 మంది అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొఫెసర్ వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఆయిల్ పామ్‌కు మేలు



మునగాల గ్రామంలో ఆయిల్ పామ్ తోట

కోరుకొండ: తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ పనులు జోరందుకుంటున్నాయి. అలాగే ఈ వర్షంతో ఆయిల్ పామ్ తోటలకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. చెట్టుకు నీరు పుష్కలంగా అందడం ద్వారా గెలలు పెరుగుతాయని, బరువు కూడా ఉంటాయన్నారు. వేసవిలో ఉద్యానవనాలకు వేధిస్తున్న తెల్లదోమ సమస్య పరిష్కారమవుతుందన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో సుమారు 4,090 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోటలున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐటీసీ ఆధ్వర్యంలో ఏజీఎస్ ఆర్గనైజేషన్ వావ్ ప్రోగ్రాం స్కూల్ కో ఆర్డినేటర్ పి.దుర్గబాబు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి ఆధ్వర్యంలో వావ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ కార్యక్రమంలో పాత పుస్తకాలు, పాత పేపర్లు సేకరించారు. ఒక పేపర్‌ను తొమ్మిది సార్లు రీసైక్లింగ్ చేస్తామని దీని ద్వారా చెట్లను కాపాడుకోవచ్చునని దుర్గబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చైతన్యవంతులై పాత పుస్తకాలు, వృథా పేపర్లు అందించారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న తొమ్మిదో తరగతి విద్యార్థి జాజుల అక్షయ దేవికి ట్రోఫీని, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏజీఎస్ కో ఆర్డినేటర్ ఎన్.రాముడు ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

దివ్యాంగులకు పౌష్టికాహారం వితరణ



వృద్ధులకు రొట్టెలు అందజేస్తున్న నిర్వాహకులు

అనపర్తి: నెల్లూరు జిల్లా సింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన రవీంద్రగౌడ్ జ్ఞాపకార్థం అనపర్తి భవిత సెంటర్‌లోని దివ్యాంగ విద్యార్థులకు పౌష్టికాహారం అందించినట్టు రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. రవీంద్ర గౌడ్ సోదరుడు రాజేంద్రగౌడ్ అందించిన ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు పాలు, రొట్టెలు, రస్కులు, బిస్కట్లతో పాటు తేతలి రామిరెడ్డి, మంగయమ్మ వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరకులు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తేతల నారాయణరెడ్డి, డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, ఏ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత మండల్లాలోనే బదిలీలు జరగాలి



ఎంపీడీవో భారతికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు

సీతానగరం: సొంత మండలాల్లోనే గ్రామ సచివాలయాలకు బదిలీలు చేయాలని కోరుతూ సీతానగరం మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు సోమవారం ఎంపీడీవో ఎం.భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి సువర్చల, సంగన సతీష్ తదితరులు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ శాఖ జీవో నంబర్ 5 ద్వారా మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల్లో సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వకూడదనే కొత్త నిబంధన విధించారన్నారు. గతంలో రెండు సార్లు సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయని, కానీ ఎప్పుడూ ఈ నిబంధన లేదన్నారు. ఆరేళ్లుగా సచివాలయంలో ఉద్యోగాలు చేస్తున్నామని, తక్కువ జీతంతో పని చేస్తున్నామని, ఇతర మండలాలకు బదిలీ చేస్తే ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వకూడదనే నిబంధనను మినహాయించాలని, అలాగే ఉద్యోగంలో పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు బి.శ్రీనివాసరావు, పల్లా వీర వెంకటకృష్ణ, ఆనాల శివ, కేతాడి శివశ్రీ పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి



జి.మామిడాడలో శ్యామా ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీజేపీ నాయకులు

పెదపూడి: భారతీయ జనతాపార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ అన్నారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించి జి.మామిడాడలో ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రంగంపేటలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా మాట్లాడుతూ ముఖర్జీ 1901లో కలకత్తాలో జన్మించారని, భారతీయ జనసంఘ్‌ను స్థాపించి 1977లో జనతా పార్టీలో విలీనం చేశారన్నారు.

సీతానగరం: బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. సీతానగరంలోని కర్రోతు లక్ష్మి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మండల ఓబీసీ అధ్యక్షులు దాసరి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తల్లికి వందనానికి ఆంక్షల కోత

కోరుకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, నాణ్యమైన విద్యనందించడం లక్ష్యంగా పనిచేయాల్సిన కూటమి ప్రభుత్వం.. ఆ విధానాలకు తిలోదకాలిచ్చింది. వివిధ ఆంక్షలు పెట్టి తల్లికి వందనం లబ్ధిదారుల సంఖ్యను తగ్గించింది. కోరుకొండ మండలంలో 55 ప్రభుత్వ, 40 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో గత సంవత్సరం 12,594 మంది విద్యార్థులు చదువుకున్నారు. అయితే ఇటీవల తల్లికి వందనం పథకం సొమ్ములు 2,535 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. దీంతో వారందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి డబ్బులు సక్రమంగా వచ్చాయని, ఇప్పుడు జమ కాలేదని చెబుతున్నారు. కాగా.. దీనిపై కోరుకొండ ఎంఈవో కుశలవదొర వివరణ కోరగా.. మండలంలోని 12,594 మంది విద్యార్థులలో 10,059 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. మిగిలిన 2,535 మంది విద్యార్థులకు జూలై ఐదున పడుతుందన్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థులు, కొత్తగా పాఠశాలల్లో చేరిన వారు ఉన్నారన్నారు.

పింఛన్ల సొమ్ము పంపిణీ చేయలేం



వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సీతానగరం: వచ్చే నెల నుంచి పెన్షన్లు నగదు అందించలేమని సీతానగరం మండల అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ఎంపీడీవో ఎం.భారతికి వినతి పత్రం అందించారు. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్లు సుబ్బలక్ష్మి, ఉమా మహేశ్వరి, సువర్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా పింఛన్ నగదు అందించే సమయంలో తప్పులు జరిగాయంటూ కలెక్టర్ ఆఫీస్‌కు రమ్మంటున్నారని, అక్కడ లిఖిత పూర్వకంగా లేఖ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అధికారులు మెమోలు ఇస్తున్నారన్నారు. పొరపాటున నగదులో తేడా వస్తే తామే భరించాల్సి వస్తోందని, ఆ కారణాలతోనే పెన్షన్ పంపిణీ విధుల నుంచి తప్పుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు రాధారాణి, నీరజాక్షి, కుమారి, రామలక్ష్మి, సీత, శాంతికుమారి, పద్మావతి పాల్గొన్నారు.

జనన, మరణాల నమోదు నూరు శాతం జరగాలి

- కలెక్టర్ ప్రశాంతి
- హెల్త్ విభాగం పరిశీలన



నగరపాలకసంస్థలో జనన, మరణ నమోదు విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జనన, మరణాల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా నూరు శాతం పరిష్కరించాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఎంత మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నదీ అడిగి తెలుసుకుని కాసేపు అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సర్టిఫికెట్ల జారీకి ఎంత సమయం పడుతున్నదో వివరాలు సేకరించారు. డ్యాష్ బోర్డును పరిశీలించి పెండింగ్ అప్లికేషన్లపై ఆరా తీశారు. 2023లో సవరించిన జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం అప్డేటెడ్ సీఆర్ఎస్ పోర్టల్ ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుందన్నారు. డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి మరణానికి గల కారణాన్ని తప్పక నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎంహెచ్‌ఓ వినూత్న, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు ఉన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు అందజేసిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 15 వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీలు ఏ దశలోనూ పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల దృష్ట్యా నగరంలో ఖాళీ స్థలాల వల్ల చుట్టు పక్కల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు.

సమస్యలపై మూడు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయి. వీటిని ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ స్వీకరించారు. తమ ఏరియాలో కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలని రఘుదేవపురానికి చెందిన కొప్పాక రాజారావు, పోరంబోకు భూమిని సర్వే చేసి, ఎస్సీలకు అందించాలని ఆ గ్రామానికే చెందిన కొప్పాక పోశమ్మ, తన పేరుపై పట్టాదారు పాస్ బుక్ అందించాలని నాగంపల్లికి చెందిన దోశపాటి నాగమణి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ (సీఎం), టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామి పీఠంలో ఈ నెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమవుతున్నాయని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని ట్రస్టు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుప్త నవరాత్రుల్లో భాగంగా ఈ నెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకూ అమ్మవారు వారాహీ దేవిగా దర్శనం ఇస్తారన్నారు. ఏటా ఆషాఢ మాసంలో వచ్చే రెండో గురువారం వ్యూహాలక్ష్మికి విశిష్ట అభిషేకం చేస్తామని, ఈ ఏడాది జూలై 3న పీఠంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనుగ్రహప్రద ఫౌండేషన్ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్ జూలై 10న 108 కిలోల గంధంతో అభిషేకం చేస్తారన్నారు. ధరణికోట దుర్గా వెంకట హేమవతి, మతల రమేష్, తిరుమారెడ్డి వెంకట అప్పారావు, బాక్స్ ప్రసాద్, వాసంశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు.